# పడుచు రక్తం!

* కాకరాల కృష్ణమూర్తి *

సుందరం సంవత్సరానికి పైగా సర్వీసుచేస్తున్నాడన్న మాటేగాని, ఆఫీసు గుమాస్తాకు తెలియవలసిన బానిసత్వపు పద్ధతులేమి తెలియవు. పెద్ద గుమాస్తాకు పదిమార్లు దండంపెట్టాలని. చీటికీ మాటికీ చిత్తం చిత్తం అంటూండాలనీ, విదేశీయ దొరలకు వంగి సలాములు చేయాలని, ఆఖరుకి బిళ్లబంట్రోతుతోకూడ బహు జాగ్రత్తగా సంచరించాలని, వచ్చేటప్పుడు వేళకు ముందుగానూ, వెళ్లేటప్పుడు పెద్దల వెనకనూ వెళ్లాలని—ఇత్యాది వ్యాపార రహస్యాలు తెలుసుకోకుండానే ఇన్నాళ్లూ రైల్వే ఆఫీసులో ఉద్యోగం సాగిస్తున్నాడు. ఈ యుక్తులు పుట్టుకలోనే తెచ్చుకున్న టైపిస్టు రంగయ్య, సుందరం చెవిలో నూరిపోసేవాడు. కాని పరువుమర్యాదలకోసం ప్రాకులాడే సుందరానికి అవేమీ నచ్చలేదు.

చెల్లెలి పెళ్ళికి వెళ్ళాలని సెల వర్జీ సమర్పించుకున్నాడు సుందరం, పెద్దగుమస్తా బల్లమీద పదిరోజులు పడుక్కుంది కాగితం, పదకొండో రోజు పెద్దగుమాస్తాగారి సెలవైంది.

"ఏమిటీ కాగితం?" అన్నాడు అర్జీవైపు అసహ్యంతో చూస్తూ.

"కాగితమా? అందులో రాసిఉందే—పది రోజులు సెలవు కావాలని."

ఏం గీర్వాణంగా ఉంది అబ్బాయికి! పెద్ద గుమస్తా కళ్లెర్రబడ్డాయి,

"ఇద్దరు గుమస్తాలు సెలవులో ఉంటే నీకెలా సెలవు దొరుకుతుందనుకున్నావు? ఆఫీసులో పని జరిగాలా వద్దా?" అన్నాడు కళ్ళద్దాల మీదనుంచి తీక్షణంగా చూస్తూ.

సుందరానికి వళ్ళు మండింది. ఇన్నాళ్లు అర్జీని అట్టేపెట్టి, ఆఖరుకు ఈ కరకు మాట్లాడ్డానికా పిలవటం? వెధవ అధికారం వీడూను.

"గుమస్తాలు తక్కువైతే నన్ను సెలవు మానుకోమంటారా ఏమిటి, కావలిస్తే, వేరే గుమస్తాను వేసుకొండి కొద్దిరోజులకి. పెళ్ళికి నేను వెళ్ళక తప్పదు" అన్నాడు సుందరం పైకొస్తూన్న కోపానికి కళ్లెం వేయడానికి ప్రయత్నిస్తూ.

"సలహాలడగడానికి నిన్ను పిలవలేదు. నీకు సెలవు దొరకదు, వెళ్ళు" అంటూ అర్జీని ఏసిరికొట్టాడు. దాన్ని తీసి సుందరం ముక్కలు ముక్కలుగా చింపి పారవేశాడు.

"సెలవియ్యకపోతే మీ ఉద్యోగం మీ దగ్గిర పెట్టుకొండి, రాజీనామా ఇస్తాను" అన్నాడు సుందరం మండిపోతూ, పాతికేళ్ళ పడుచురక్తం ఉబికి పాకుతూ.

"రాసియ్యి" అన్నాడు క్లుప్తంగా, నిర్లక్ష్యంగా, ఏభైయేళ్ళ ముసలిరక్తం నిదానంగా ప్రవహిస్తోంది.

సుందరం చిటికెలో ఇంకో కాగితం రాసిచ్చేడు. సెలవిచ్చినా సరే, రాజీనామా తీసుకున్నా

సరే, పెద్దగుమస్తా కాగితం తీసుకుని, కోటు గుండీలు పెట్టుకుంటూ దొర గదిలో ప్రవేశించాడు. కాస్తసేపు మాట్లాడి, పైకి వచ్చి "వెళ్ళు దొర దగ్గిరికి" అన్నాడు గంభీరంగా.

సుందరం వెళ్ళి దొరముందు నిల్చున్నాడు. అటు ఆ దేశానికి ఇటు ఈ దేశానికి చెందని ఒక తెల్లమృగం తన స్థూలకాయాన్ని తిరుగుడు కుర్చీలో ఇమిడ్చి సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. సుందరాన్ని చూచి దొర తన వాడుక భాషలో వాగడం మొదలెట్టేడు: "ఏమిటీ వికారపు రాతలు" అన్నాడు. సుందరం ఆర్పడానికి ప్రయత్నిస్తూన్న కోపాగ్ని ఇట్టే రాజుకుంది. పది రోజులు సెలవివ్వడానికి ఎన్ని ఎత్తిపొడుపులు, ఎన్ని తికమకలు! ఎంత అహంకారం ఈ అధికారులకి!

"కాగితం చదువుతే తెలుస్తుంది"అన్నాడు ముక్తసరిగా.

దొర కాలుస్తూన్న సిగరెట్టుని నేల విసరి కొట్టేడు.' 'డేమెట్', ఎంత పొగరుబోతుదనం! ముప్పయిరూపాయిల ముష్టిజీతగాడికి!....ఛడీ మంటే పడీమన్నారు ఇద్దరూ. సెలవు దొర కదు పొమ్మన్నాడు దొర. ఉద్యోగం అక్కర లేదు పొమ్మన్నాడు సుందరం. దొర పెద్ద గుమస్తాను పిలిచేడు, సుందరానికి ముట్టవలసిన జీతం ఇచ్చి ఇంటికి పంపించేయమన్నాడు.

ఇరవై రోజులజీతం జేబులో వేసుకొని సుందరం ఇంటిమొఖం పట్టేడు. ఆఫీసు వదుల్తూంటే రంగయ్య "నే చెప్పలేదూ" అన్న మాటలు చెవిలో ఆడుతూన్నాయి. ఇలాంటి ఉద్యోగం ఉంటేనేం ఊడితేనేం, ముందు పెళ్లిచూచుకుని ఆ తరువాత ఆలోచించొచ్చు ఉద్యోగం సంగతి సావధానంగా. ఇంటికి వెళ్లి మూటా ముల్లె సర్దుకున్నాడు, రాత్రిబండికి ఊరికి వెళ్ళిపోవాలని సాయంత్రం అతని తండ్రి కాళ్లీడ్చుకుంటూ మెట్లెక్కేడు. సుందరం తండ్రిని చూచి నిర్ఘాంతపోయేడు.

"చెల్లమ్మపెళ్ళి ఆగిపోయిందిరా, అబ్బీ. కుర్రవాడికి చాలా జబ్బుగా ఉందట" అంటూ మంచంమీద చతికిలబడ్డాడు ముసలాయన.

# వరస తప్పింది

ఆముదాలపల్లి వెంకటకోటేశ్వరరావు

మేనేజరు డైరీ తీసి చూశాడు. రేపు శెలవు అని తెల్సుకున్నాడు.

జవానువచ్చాడు. వినయంగా పెట్టాడుముఖం.

" రేపు మా మరదలి పెళ్ళి. సాయంత్రానికల్లా... మీరు కనికరించాలి " అంటూ మాట నమిలాడు.

" మరి ఆఫీసులోనో..."

" శేషయ్య వుంటాడు !"

" సరే వెళ్లేప్పుడు రేప్పొద్దున చెప్పించు."

శాస్త్రి వచ్చాడు.

" రేపు మా తమ్ముడు వస్తాడు. మేం వేరే ప్రోగ్రాం వేసుకున్నాం."

" ఇంకేం. రేపు ఎవైల్ చేసుకుంటారా !" అన్నాడు.

" మీ యిష్టం."

"రేపు ప్రొద్దున పనివుంటే కబురుచేస్తాలెండి"

ఇద్దరు జవానులూ, యిద్దరు గుమాస్తాలూ వచ్చారు. ఈ రీతిగానే సమాధానం పొందారు.

మేనేజరు పైకి వెళ్ళాడు.

" రేపు శెలవ...వాడు వెంకోబరావు వస్తానన్నాడు. మేటనీకే వెళ్దాం అనుకుంటున్నాడు" అన్నాడు భార్యతో, తనే ఆమె ముందర గుమాస్తాగా. మేనేజరుకు ఈ రకమయిన వినయం, రోజూ చూట్టంవల్ల అతనికే అలవాటయింది. అదే భార్యముందు ప్రదర్శించాడు.

"రేపా...రేపు కామేశ్వరి వాళ్ళింటికి రమ్మనమన్నది. మేం సినిమాకు వెళ్లాలి. మీరు లేకపోతే ఎట్లా...మీరుండండి. రేపు శెలవేగా" అంది కాఫీ చల్లారపోస్తూ.

మేనేజరు శెలవు మంజూరు కాలేదు. అటూయిటూ తిరిగాడు విసుగుతో.

"శేషయ్యా" అన్నాడు. వాడు వచ్చాడు.

"వెళ్ళి అందరు గుమాస్తాలను పిల్చుకురా. శెలవటు-శెలవయితే ఆఫీసుకు రావాలని లేదూ. పనిఅంతా అట్లావుంటే...ఎట్లా పో బుదిపుట్టుందో" వాణ్ణి జవాన్ను కూడా పిల్చుకురా" అన్నాడు.

తిరిగి శెలవల వరస తప్పింది.